పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం

- డ్రెయినేజీల్లో, ఖాళీస్థలాల్లో పేరుకుపోతున్న మురుగునీరు
- విజృంభిస్తున్న దోమలు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని ఆయా గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. వీధుల్లో డ్రెయినేజీల్లో మురుగునీరు పేరుకుపోయి అస్తవ్యస్తంగా మారడంతో గ్రామాలు దుర్గంధభరితంగా మారాయి. వానాకాలం ప్రారంభం కావడంతో గ్రామాల్లో దోమలు వృద్ధి అధికమైంది. దీంతో సీజనల్ వ్యాధులు విపరీతంగా వస్తుండటంతో ఆయా గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

విషజ్వరాలతో ఇబ్బందులు..

పల్లెలతో పాటు పట్టణాలలోనూ దోమల తీవ్రత క్రమేనా పెరుగుతుంది. దోమలతో డెంగీ, మలేరియా, టైఫాయిడ్, చికెన్‌గున్యా, లాంటి విషజ్వరాల అధికంగా వస్తుండడంతో మండలంలోని బూరుగడ్డ, మాచవరం, లక్కవరం గ్రామాల ప్రజలు ఆస్పత్రులకు పరుగులు పెడుతున్నారు. పది రోజులుగా ఆయా గ్రామాల ప్రజలు ఒళ్లునొప్పులతో కూడిన జ్వరాల బారిన పడి తీవ్ర ఇబ్బందులు



లక్కవరంలో మురుగునీటిలో ఆయిల్‌బాల్స్ వదులుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ గిరిబాబు, సిబ్బంది

పడుతున్నారు. జ్వరం తగ్గిన తరువాత కాళ్ల నొప్పులు వస్తుండడంతో కోదాడ, ఖమ్మం, హైదరాబాద్ ప్రాంతాలకు వెళ్లి వైద్యం చేయించుకుంటున్నట్లు బాధితులు వాపోతున్నారు. లక్కవరంలో ఇటీవల విషజ్వరంతో ఓ మహిళ మృతి చెందింది.

దోమలను నివారించాలి..

మండలంలో 11గ్రామాలతో పాటు మరో మూడు శివారు గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామ పంచాయతీల్లోని పలు కాలనీల్లో ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఖాళీ స్థలాలు, డ్రెయినేజీలు, రహదారుల వెంబడి మురుగునీరు చేరి దోమలకు నిలయంగా మారాయి. దీంతో పగలు, రాత్రి అనే తేడా లేకుండా దోమలు సంచరిస్తూ హడలెత్తిస్తున్నాయి.



బూరుగడ్డలో డ్రెయినేజీలో పేరుకుపోయిన చెత్తచెదారం

డ్రై డే పనుల్లో వేగం పెంచాలి..

స్థానిక సంస్థల ఆధ్వర్యంలో ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రై డే కార్యక్రమాలు నిర్వహిస్తూ పారిశుద్ధ్యాన్ని మెరుగు పరుస్తున్నారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో అధికారులు మరింత వేగంగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టి గ్రామాల్లో శానిటేషన్, ఫాగింగ్, వీధుల్లో బ్లీచింగ్ చల్లించడం, డ్రెయినేజీలను శుభ్రపరచడంతో పాటు ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టి పరిశుభ్రతకు పెద్దపీట వేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

శానిటేషన్, ఫాగింగ్ చేయించాలి



"ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా గ్రామాల్లో శానిటేషన్, ఫాగింగ్ చేయించాలి. అంతే కాకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య,, ఆరోగ్య శాఖ అధికారులు అవగాహన కల్పించాలి. ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహించాలి. ఇంటి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించి, నీటి నిల్వ ఉంచకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రతి గ్రామంలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలి.

– కాసాని గోపాల్, బూరుగడ్డ

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



"సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఎప్పటికప్పుడు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోని నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. వేడి చేసిన నీటిని తాగాలి. అదే విధంగా ఆహారం కలుషితం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. జ్వరపీడితులు ఆలసత్వం చేయకుండా తక్షణమే వైద్యులను ఆశ్రయించి మెరుగైన వైద్యం చేయించుకుంటే సమస్యలు కూడా తలెత్తకుండా ఉంటాయి.

– పుష్పలత, మండల వైద్యాధికారిణి, హుజూర్‌నగర్

వాసవీమాత ఆలయంలో ప్రత్యేక పూజలు



వాసవీమాత ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

మఠంపల్లి : మండల కేంద్రంలోని వాసవీమాత ఆలయంలో వాసవీమాత, గోదాదేవీలకు ఆర్యవైశ్య మహిళలు ఆదివారం ఆషాడమాసం సారే సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో లలితా సహస్ర నామం, విష్ణు సహస్రనామం, కుంకుమ పూజలు చేపట్టారు. అదే విధంగా అమ్మవార్లకు చీరలు, రవికలు, గాజులు, పసుపు కుంకుమలు, పండ్లు, పూలు, మిఠాయిలతో సారేను అందజేశారు. అనంతరం వర్షాలు కురవాలని, పాడిపంటలతో ప్రజలు తులతూగాలని, వ్యాపారాలు అభివృద్ధి చెందాలని కోరుతూ గ్రామంలోని శివాలయం దగ్గర నుంచి శ్రీవేణుగోపాలస్వామి దేవాలయం వద్ద ఉన్న బొడ్రాయికి జలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కందె వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు వంగవేటి చినరామారావు, కార్యదర్శులు బొగ్గవరపు రాధాకృష్ణమూర్తి, కుక్కడపు కాంతారావు, చీదెళ్ల సత్యనారాయణ, వి.ఆంజనేయులు, ఆర్యవైశ్య సంఘం మహిళా అధ్యక్షురాలు కుక్కడపు సంధ్యారాణి, కార్యదర్శులు వంగవీటి భూలక్ష్మి, కొత్తా శ్యామల, వంగవీటి పద్మావతి, చీదెళ్ల స్వాతి, అధిక సంఖ్యలో మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలి



బూరుగడ్డలో పిచ్చిమొక్కలు, కంపచెట్లు తొలగిస్తున్న యువకులు

హుజూర్‌నగర్‌రూరల్ : ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని పలువురు యువకులు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని బూరుగడ్డ, మాచవరంలో గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి యువకులందరూ డ్రెయినేజీలో పేరుకుపోయిన చెత్తాచెదారంతో పాటు పిచ్చి మొక్కలు, కంపచెట్లను తొలగించి శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడారు. పదిరోజులుగా గ్రామంలో సుమారు 40శాతానికి పైగా డెంగీ, టైఫాయిడ్, మలేరియా వంటి విషజ్వరాలతో నానా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీలో నిధులు లేకపోవడంతో గ్రామంలో శానిటేషన్ పనులు, బ్లీచింగ్ పౌడర్ చల్లకపోవడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారి దోమలు విపరీతంగా వృద్ధి చెందుతున్నాయని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవతీసుకుని శానిటేషన్ పనులు చేయించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామయువకులు యరగాని నాగరాజు, మేరిగ మట్టపల్లి, పెమ్మగాని నాగరాజు, సురేష్, గోపి, సతీష్, వీరబాబు, సతీష్, జీపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు వెంట చెత్తాచెదారం



చిలుకూరులో బేతవోలు రోడ్డు వెంటనే పడేసిన చెత్త

చిలుకూరు : మండలంలోని మేజర్ గ్రామపంచాయతీ అయిన బేతవోలు గ్రామంలో ఎక్కడ చెత్త అక్కడే రోడ్డు వెంట పేరుకుపోయింది. బేతవోలు నుంచి చెన్నారిగూడెం వెళ్లే రోడ్డు పొడువునా చెత్తవేయడంతో అధ్వానంగా మారింది. అలాగే గ్రామంలోని 2, 3వ వార్డులతో కూడ చెత్త రోడ్డు వెంట ఉంది. దీంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయని పలువురు గ్రామస్తులు వాపోతున్నారు. తక్షణమే చెత్తను తొలగించి దోమల నుంచి కాపాడాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

కొండా నర్సయ్య జీవితం స్ఫూర్తిదాయకం

మోతె : తెలంగాణ సాయుధ పోరాటయోధుడు కొండా నర్సయ్య జీవితం స్ఫూర్తిదాయకమని సీపీఎం గ్రామ కార్యదర్శి కొండా భాస్కర్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని బుర్కచర్లలో కొండా నర్సయ్య 3వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భాస్కర్ మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యుడు కొండా రాములు, సామ్రాజ్యం, పంతంగి గోపాల్, ఇరుగు కృపానందం, వీరయ్య, లక్ష్మమ్మ, శ్రీరాములు, అచ్చాలు తదితరులు పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని పూజలు

ఆత్మకూర్ (ఎస్) : వర్షాలు సమృద్ధిగా కురవాలని పాత సూర్యాపేటలోని శ్రీ చక్రగిరి నరసింహస్వామి గుట్టపై నెమ్మికల్, పాత సూర్యాపేట గ్రామస్తుల ఆధ్వర్యంలో ఆదివారం వరద పాశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గుట్టపై ఉన్న నరసింహస్వామి కోనేరులో నీటిని ఎత్తిపోసి కోనేరును శుభ్రపరచారు. అక్కడే ఉన్న నవగ్రహాలకు విశిష్ట పూజలు చేశారు.

పురాతన పాఠశాల భవనాలను కూల్చివేయాలి

మునగాల : నియోజకవర్గ వ్యాప్తంగా శిథిలావస్థలో ఉన్న పాఠశాలల భవనాలను కూల్చివేసి నూతన భవనాలు నిర్మించాలని డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు తుమ్మ సతీష్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున శిథిలావస్థలో ఉన్న భవనాలు కూలిపోయే ప్రమాదముందని, ముందస్తుగా భవనాలను తొలిగిస్తే ప్రమాదాన్ని అరికట్టవచ్చని అన్నారు.

ఘనంగా తీజ్ వేడుకలు



తీజ్ వేడుకల్లో పాల్గొన్న నాయకులు

అనంతగిరి : మండలంలోని కొత్తగోల్‌తండాలో గిరిజనులు తీజ్ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామపెద్దల సమక్షంలో పెళ్లికాని యువతులు నవధాన్యాలతో బోనాలను ఏర్పాటు చేశారు. ఈ తీజ్ వేడుకలు తొమ్మిదోరోజుల పాటు సాగనున్నాయి. ఈ సందర్భంగా గ్రామస్తులు గ్రామంలో వర్షాలు విరివిగా కురియాలని, పాడి పంటలు సంవృద్ధిగా పండాలంటూ మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు బాణోతు బాబునాయక్, మాజీ జెడ్పీటీసీ ధరావత్ ధనలక్ష్మి, శంకర్‌నాయక్, బాణోతు గోపినాయక్, రవినాయక్, బాణోతు శ్రీను, శ్రీనివాస్‌నాయక్ పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

హుజూర్‌నగర్ : పట్టణంలోని గోవిందపురంలో కొత్తగా వేసిన బోరు, పైపులైన్ కోసం ఆదివారం నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సౌజన్య ధనంజయ్, నాయకులు పోతుల జ్ఞానయ్య, గొట్టముక్కల రాములు, వెంకన్న, వీరబాబు, దీవెన్‌కుమార్, కాంతారావు, వినోద్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మండపం నిర్మాణానికి విరాళం

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీ కోదండ రామస్వామి ఆలయానికి అనుబంధంగా నిర్మించనున్న కల్యాణ మండపం నిర్మాణానికి మండల కేంద్రానికి చెందిన అనంత లక్ష్మయ్య, అనంత శ్రీనివాస్‌ల జ్ఞాపకార్థంగా అతడి కుటుంబ సభ్యులు అనసూర్యమ్మ ఆదివారం రూ.30 వేల విరాళం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు భౌరిశెట్టి వెంకటరత్నం, ప్రధాన కార్యదర్శి వెంకన్న, నర్సింహారావు పాల్గొన్నారు.

సేవాలాల్ యువ సేన అధ్యక్షుడిగా జానునాయక్

హుజూర్‌నగర్ : మేళ్లచెరువు మండలానికి చెందిన బి.జానునాయక్ సేవాలాల్ యువ సేన నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు డి.రవీందర్‌నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

చాకలి ఐలమ్మ స్ఫూర్తితో పోరాడాలి



చాకలి ఐలమ్మ కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చిట్యాల (చాకలి) ఐలమ్మ స్ఫూర్తితో అన్యాయాలు, అక్రమాలపై పోరాటం చేయాలని బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ధూళిపాల శ్రీనివాస్ అన్నారు. ఆదివారం సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ మనవడు రామచంద్రయ్యకు, మునిమనవడు సంపత్, ముని మనవరాలు శ్వేతలను పట్టణంలోని బీసీ భవన్‌లో శాలువ పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బి.గోవిందరావు, జి.దీప, సీహెచ్.లీలావతి, రాయల వెంకటేశ్వర్లు, నరసింహాచారి, బి.నాగేశ్వరావు, ఆర్.రామారావు, కె.శేఖర్, ఎం.సైదయ్య, పి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవులకు ప్రభుత్వం రాయితీలను అందించాలి



సుదర్శనాన్ని సన్మానిస్తున్న పెనుయేలు సంఘం సభ్యులు

మునగాల : నియోజకవర్గంలోని క్రైస్తవులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీలను అందించాలని, అందుకు తనవంతు కృషిచేస్తానని పెనుయేలు సంఘాల వ్యవస్థాపకుడు బిషప్.డా.జె.సుదర్శనం అన్నారు. నియోజకవర్గ పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీకి అధ్యక్షుడిగా సుదర్శనం ఏకగ్రీవంగా ఎన్నికవ్వడంతో ఆదివారం మండల కేంద్రంలోని పెనుయేలు వర్షిప్ సెంటర్‌లో సంఘం సభ్యులు ఘనంగా పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎవరైన బీసీ(సీ)సర్టిఫికెట్ పొందడానికి సమస్యలు ఎదురైతే నాదృష్టికి తీసుకువస్తే సంబంధిత రెవెన్యూ అధికారులతో సంప్రదించి సమస్య పరిష్కారం అయ్యే దిశంగా కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కోదాడలోని ప్రతి మండల కేంద్రంలో క్రైస్తవుల సమాధులకు స్థలాలు, క్రిస్టియన్ భవన్‌ల నిర్మాణానికి, క్రిస్టియన్ మైనార్టీలకు సంబంధించిన రుణాలు, తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి వారికి న్యాయం జరిగేంతవరకు పోరాడుతానని అన్నారు. కార్యక్రమంలో పెనుయేలు సంఘం సభ్యులు కె.రాజు, పి.కరుణ, జె.మార్థమ్మ, ఎల్.పూలమ్మ, కె.ఉపేందర్, కత్తి శ్రీను, ఎస్.వాణి, తబిత, తిరుమల, సంతోషమ్మ, పి.కరుణాకర్, ఎల్.అంజలి, ఎల్.వినోద్ పాల్గొన్నారు.

తాడువాయిలో కొనసాగుతున్న వైద్యశిబిరం



వైద్యశిబిరంలో జ్వరపీడితులకు చికిత్స అందిస్తున్న వైద్యాధికారి వైష్ణవి



తాడువాయిలో శానిటేషన్ పనులను పరిశీలిస్తున్న ఆర్డీఓ, ఎంపీడీఓ, తహసీల్దార్

మునగాల : మండలంలోని తాడువాయి గ్రామంలో పదిరోజులుగా ప్రబలుతున్న విషజ్వరాలను అరికట్టేందుకు మండలంలోని రేపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరం రెండో రోజుకు చేరింది. ఈ వైద్యశిబిరంలో 48మంది అవుట్ పేషంట్లుగా తమ పేర్లు నమోదు చేసుకోగా 8మందికి ఫీవర్ ఉన్నట్లు గుర్తించినట్లు వైద్యులు వెల్లడించారు. ప్రస్తుతం 17మంది జ్వరంతో బాధపడుతున్నారని, నలుగురికి డెంగీ పాజిటివ్ లక్షణాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. 16మంది నుంచి రక్త నమూనాలు సేకరించి సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి మెరుగైన వైద్యచికిత్స కోసం పంపించినట్లు వైద్యులు డా.వైష్ణవి, డా. వినయ్‌కుమార్‌లు తెలిపారు. ఈ శిబిరంలో రేపాల ప్రాథమిక కేంద్రం వైద్యాధికారి డా.శ్రీశైలం, డా.వైష్ణవి, పీహెచ్ ఎన్ శారద, హెల్త్‌సూపర్‌వైజర్ శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్లు లింగం రామకృష్ణ, లింగయ్య, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్ పనుల పరిశీలన

మండలంలోని తాడువాయి గ్రామంలో పదిరోజులుగా ప్రజలు విషజ్వరాల బారిన పడుతుండడంతో గ్రామపంచాయతీ సిబ్బంది శానిటేషన్ పనులు చేపట్టారు. ఈ పనులను ఆదివారం కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్, తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీఓ ఎన్.భూపాల్ రెడ్డితో కలసి గ్రామంలోని పలు వీధుల్లో పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడారు. మురుగునీటిని సీసీరోడ్లపైకి మళ్లించే వారు, ఇంటి పరిసర ప్రాంతాలలో పెంటకుప్పలు పోసే వారిని గుర్తించి వారికి నోటీసులు జారీ చేసి తక్షణమే తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందులో భాగంగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో రేపాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించి జ్వరపీడితులకు మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. గ్రామంలో పారిశుద్ధ్యానికి విఘాతం కలిగించే వారికి నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకోవాలని మండల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మండల అధికారులతో పాటు మండలంలోని తాడువాయి, రేపాల, విజయరాఘవపురం, ఈదులవాగు తండ, కొక్కిరేణి గ్రామ కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గరిడేపల్లి : సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

గరిడేపల్లి : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2005–2006, మండల పరిధిలోని గడ్డిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2000–2001 బ్యాంచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నాడు పాఠశాలలో గడిపిన జ్ఞాపకాలను గుర్తుకు చేసుకుని సంతోషంగా గడిపారు. విందు, వినోదాలతో సాయంత్రం వరకు సందడి చేశారు. అనంతరం నాటి ఉపాధ్యాయులు అమృతారెడ్డి, ధనమ్మ, శ్రీనివాస్, సత్యనారాయణరెడ్డి, ప్రభాకర్, సైదిరెడ్డి, అంజనేయ శర్మ, రవీందర్‌రెడ్డి, రమేష్, శ్రీనివాస్‌రెడ్డి, వీరారెడ్డి, అనంతయ్య, మధు, బుచ్చిరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ : పట్టణంలోని ఎన్నెస్పీ క్యాంప్ హైస్కూల్‌లో 1987–1992 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ హోదాల్లో, ఉద్యోగాలలో ఉన్న పూర్వవిద్యార్థులు పాఠశాలలో కలుసుకుని నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం అప్పటి గురువులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆనాటి హెచ్‌ఎం ఎం.రామకృష్ణమాచార్యులు, ఉపాధ్యాయులు డి.అనంతరామశర్మ, వి.నరసయ్య, యతిపతిరావు, అన్నపూర్ణ, పీఈటీ మంగయ్య, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్ : ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ప్రమాదకరంగా మిషన్ భగీరథ గుంత



బేతవోలు ప్రాథమిక పాఠశాలలో తవ్వి వదిలేసిన గుంత

చిలుకూరు : మండలంలోని బేతవోలు ప్రాథమిక పాఠశాల ఆవరణలో మిషన్ భగీరథ ట్యాంక్ వద్ద తీసిన గుంత ప్రమాదకరంగా మారింది. ట్యాంక్‌కు నీటిని పంపించేందుకు మరమ్మతుల నిమిత్తం గుంత తీసి వారం రోజులు గడుస్తున్నా నేటికీ పూడ్చకపోవడంతో విద్యార్థులు ఆ గుంతలో పడే ప్రమాదం ఉంది. తక్షణమే సంబంధిత సిబ్బంది గుంతను పూడ్చివేయాలని పలువురు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

హక్కుల సాధనకు కలిసి రావాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

హుజూర్‌నగర్ : ముదిరాజుల హక్కుల సాధనకు అందరూ కలిసిరావాలని ఆ సంఘం నాయకులు అన్నారు. ఆదివారం పట్టణంలో పట్టణ చెరువుల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ముదిరాజ్ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ముదిరాజులందరూ ఒకతాటిపైకి వచ్చి కమిటీగా ఏర్పడాలన్నారు. రానున్న రోజుల్లో ముదిరాజులను బీసీ డీ నుంచి బీసీ ఏలోకి మార్చేందుకు ఉద్యమించాలన్నారు. చెరువులు కబ్జాకు గురికాకుండా హద్దులు ఏర్పాటు చేయాలని, చెరువుల్లో చేపల పెంపకాన్ని బహిరంగ వేలం వేయాలని కోరారు. ముదిరాజులు రాజకీయంగా ఎదగడం కోసం వారి సంఖ్య ఎక్కువగా ఉన్న వార్డులను అన్ని పార్టీల వారు ముదిరాజులకే టికెట్లు కేటాయించేలా చూడాలన్నారు. సమావేశంలో సంఘం నాయకులు ముసలప్ప, చంద్రయ్య, ఎం.సీతయ్య, ఎం.రాంగోపి, సతీష్, ఎం.మంగమ్మ, వెంకమ్మ, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

సాగర్ సిమెంట్స్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం



వైద్యశిబిరంలో పాల్గొన్న వైద్యసిబ్బంది, రోగులు, సాగర్ సిమెంట్స్ పరిశ్రమ అధికారులు

మఠంపల్లి : మండలంలోని పెదవీడు హైస్కూల్‌లో ఆదివారం స్థానిక సాగర్‌సిమెంట్స్ పరిశ్రమ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని బసవతారక ఇండో అమెరికన్ కేన్సర్ నిర్ధారణ కేంద్రం వారిచే ఉచిత కేన్సర్ నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ ఎంవీ రమణమూర్తి, హెచ్ఆర్ డీజీఎం హరిదాస్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమారు 248మందికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించి, రూ.లక్షా 50వేల విలువగల మందులు ఉచితంగా అందజేసినట్లు వైద్యసిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో వైద్యబృందం డాక్టర్ రవిశంకర్, డాక్టర్ శ్రావణకుమారి, డాక్టర్ సులోచన, డాక్టర్ హరీష్, డాక్టర్ సదాశివ రెడ్డి, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఆలయ పునర్నిర్మాణ పనులు



కొనసాగుతున్న ఆలయ నిర్మాణ పనులు

నడిగూడెం : మండలంలోని సిరిపురం గ్రామ సమీపంలో ఉన్న 200సంవత్సరాల నాటి శ్రీరంగ నాయకస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులు కొద్ది రోజులుగా ముమ్మరంగా జరుగుతున్నాయి. 30ఏళ్లగా ఆలయంలో ఎలాంటి పూజలు లేకుండా శిథిలావస్థకు చేరింది. దీంతో సంబంధిత దేవాదాయశాఖ ఏడాది కిందట రూ.40లక్షలు మంజూరు చేసింది. అలాగే గ్రామస్తులు రూ.10లక్షలు విరాళాలు సేకరించారు. ఆ నిధులతో ఆలయ పునర్నిర్మాణ పనులు చేపట్టారు. నాడు ఆలయం ఆవరణంలో నిత్యం పూజలు, ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించేవారు. చుట్టు పక్కల గ్రామాలకు చెందిన వందల మంది భక్తులు పూజల్లో పాల్గొనేవారని పూర్వీకులు చెబుతున్నారు. పనులు ముమ్మరంగా జరుగుతుండడంతో ఆలయానికి పూర్వ వైభవం రానుందని గ్రామస్తులు చెబుతున్నారు.

ముక్కంటి ఆశయ సాధనకు కృషి చేయాలి



నివాళులర్పిస్తున్న నాయకులు

గరిడేపల్లి : ముక్కంటి ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యదర్శి మేకల కనకారావు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని వెలిదండ గ్రామంలో ముక్కంటి సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కనకారావు మాట్లాడుతూ.. ముక్కంటి చిన్నతనం నుంచే విప్లవ రాజకీయాలను పునికి పుచ్చుకొని అనేక కార్యక్రమాల్లో పాల్గొనేవాడని, పార్టీ కోసం ఎన్ని అడ్డంకులు ఎదురైనా వెనకాడలేదన్నారు. కార్యక్రమంలో కామళ్ల నవీన్, కామళ్ల శ్రీను, నాగేశ్వరరావు, ముత్తయ్య, పర్వతాలు, మల్లేష్, అంజయ్య, నాగేష్, నరేష్, సంతోష, వెంకటమ్మ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పీర్ల ఊరేగింపు



నేరేడుచర్ల : పెంచికల్‌దిన్నెలో పీర్ల ఊరేగింపు..



గరిడేపల్లి : పీర్లను ఊరేగిస్తున్న నిర్వాహకులు

నేరేడుచర్ల : మండలంలోని పెంచికల్‌దిన్నె గ్రామంలో ఆదివారం పీర్ల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీర్లకు దట్టీలతో అందంగా అలంకరించి మేళతాళాల నడుమ వీధుల్లో ఊరేగింపు చేపట్టారు. అదే విధంగా మండలంలోని వివిధ గ్రామాల్లో పీర్ల పండుగను నిర్వహిస్తున్నారు.

గరిడేపల్లి : మండల కేంద్రంలో పీర్ల ఊరేగింపు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని కట్టవారిగూడెం, సర్వారం, గానుగబండతో పాటు గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పూలతో పీర్లను అలంకరించి నైవేద్యాలు సమర్పిస్తున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.